## క్లుప్తంగా

### ముగిసిన ఇంటర్ పరీక్షలు

సీతంపేట: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. జిల్లాలో 21 పరీక్ష కేంద్రాల్లో మొదటి సంవత్సరం ఇంటర్‌ విద్యార్థులు 11,318, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 10,945 పరీక్షలు రాసినట్టు సంబంధిత అధికారులు తెలిపారు.

### సంత వేలం పాట ఖరారు

సీతంపేట: సీతంపేట వారపు సంత వేలం పాట బుధవారం ఖరారైంది. సంత వేలం పాటను రూ.4లక్షల 90 వేలకు తోయక అప్పారావు, రోజువారీ వేలం పాటను 72 వేల వది రూపాయిలకు హిమరక గిరి దక్కించుకున్నారు. మొత్తం 39 మంది వేలం పాటలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అరిక కళావతి, డీఎల్‌పీఓ రాంప్రసాద్, ఈఓపీఆర్‌డీ కె.సత్యం, గ్రామ కార్యదర్శి సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీరంజని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఎనిమిదో తరగతిలో రెండు, 9వ తరగతిలో 2 సీట్లతో పాటు ఇంటర్మీడియెట్ హెచ్‌ఈసీ గ్రూపులో 40 సీట్లు చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఏప్రిల్ 20 వరకు ఏపికేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 79010 98513 ఫోన్ నంబరుకు సంప్రదించాలని కోరారు.

### వైద్యశిబిరం ఏర్పాటు

మక్కువ: మండలంలోని నంద, నందబొడ్డవలస గ్రామాల్లో శంబర పీహెచ్‌సీ వైద్యాధికారి రఘుకుమార్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరంలో 69 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### స్వచ్ఛ సంకల్పం శిక్షణ కేంద్రం సందర్శన



మాట్లాడుతున్న డీపీఓ సత్యనారాయణ

సీతానగరం: మండలంలోని పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీలో జరుగుతున్న స్వచ్ఛ సంకల్పం శిక్షణ తరగతులను డీపీఓ బి.సత్యనారాయణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణకు గ్రామ వలంటీర్ల సహాయం తీసుకుని ప్రజల్లో పారిశుద్ధ్యం పట్ల అవగాహన కల్పించాలి. ఇంటి నుంచి చెత్త సేకరించినప్పుడే తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి క్లాప్ మిత్రలకు ఇచ్చేవిధంగా చేయాలి. తదుపరి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌వద్ద ఎంపిక చేసిన తడిచెత్త నుంచి వర్మీకంపోస్టు తయారు చేయాలని, పొడిచెత్తను వేరుచేసి మండలానికి మంజూరైన ష్రెడ్డర్‌ను వినియోగించి ముక్కలుగా చేసి అమ్మకం చేయడం ద్వారా పంచాయతీ ఆదాయాన్ని సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. గరుగుబిల్లి మండల ఈఓపీఆర్‌డీ గోపాలరావు మాట్లాడుతూ మార్పు నెమ్మదిగా వస్తుందని, దానికి సచివాలయ సిబ్బంది కృషిచేయడం ద్వారా స్వచ్ఛమైన గ్రామాలను రూపొందించుకోవచ్చన్నారు. ప్రభుత్వం గ్రీన్ ట్రిబ్యునల్ వంటి స్వచ్ఛంద విభాగాల ద్వారా పర్యావరణానికి హానిచేసే కార్యక్రమాలను నియంత్రిస్తుందని, అందులో భాగంగా రాబోయే కాలంలో చెత్త భారీగా కేంద్రీకృతమైనచోట భారీ పన్నులు వేసే అవకాశం ఉందని కావున స్వచ్ఛ సంకల్పంకోసం కృషిచేద్దామని పిలుపునిచ్చారు. సమావేశాన్ని స్థానిక సర్పంచ్ తేరే జమ్మ ప్రారంభిస్తూ స్వచ్ఛ సంకల్పం అందరి బాధ్యతఅని, పంచాయతీల్లో రాజకీయాలకు అతీతంగా అమలు చేయడానికి సంకల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెదభోగిలి ఈఓ. వెంకట్రావు, జూనియర్ సహాయకులు రమేష్, కృష్ణరాయపురం కార్యదర్శి శ్రీనివాసరావు, అరు మండలాల కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, వ్యవసాయ సహాయకులు, వెటర్నరీ సహాయకులు, క్లాప్ మిత్రలు హాజరయ్యారు.

### ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ప్రారంభం

బలిజిపేట: బలిజిపేట, సీతానగరం మండలాలకు సంబంధించిన ఐసీడీఎస్ ప్రాజెక్టు కొత్త కార్యాలయం అద్దె భవనాన్ని ఎమ్మెల్యే జోగారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ కొత్త ప్రాజెక్టు ఏర్పాటైనందున వసతుల కల్పన, కేంద్రాల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సూపర్‌వైజర్లు, సిబ్బంది విధి నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా పనిచేయాలని సూచించారు. బలిజిపేట మండలంలో 94, సీతానగరం మండలంలో 86కేంద్రాలు దీని పరిధిలో ఉంటాయని సీడీపీఓ సుగుణ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి



వీరఘట్టంలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా రూ.9.84 కోట్ల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

- ఆసరా వారోత్సవాల్లో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్
- థాంక్యూ సీఎం నినాదాలతో మారుమోగిన సభా ప్రాంగణం

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని, ప్రతీ మహిళా ఆర్థికాభివృద్ధి సాధించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా వీరఘట్టం శివారులో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వీరు పాల్గొని మాట్లాడారు. మూడవ విడత వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా మండలంలోని 1379 డ్వాక్రా సంఘాలలో ఉన్న 15,279



వీరఘట్టంలో జరిగిన వైఎస్సార్ ఆసరా వారోత్సవ వేడుకల్లో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

మంది మహిళలకు రూ.9.84 కోట్ల చెక్కును వీరు అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గడిచిన మూడేళ్లలో వైఎస్సార్ ఆసరా ద్వారా మండలంలో రూ.29.43 కోట్లను అందజేయడం జరిగిందన్నారు. సీఎం జగన్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరాభిమానాలు చూడలేక ప్రతిపక్ష నేతలు కుయుక్తులు పన్నుతున్నారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేసి ఆయన రుణాన్ని తీర్చుకుందామని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని సర్వేలు చెబుతున్నాయని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో కూడా లేవని విక్రాంత్ పేర్కొన్నారు.

**థాంక్యూ సీఎం అంటూ నినాదాలు**

గత టీడీపీ నిరంకుశ పాలనలో నిరాశతో నిట్టూర్పులు చూసిన ప్రజలకు ఒక్కసారిగా అడగకుండానే ఇన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని వేల సంఖ్యలో తరలివచ్చిన మహిళలు పెద్ద ఎత్తున థాంక్యూ సీఎం అంటూ నినాదాలు చేశారు. వీరితో పాటు ఎమ్మెల్యే కళావతి కూడా థాంక్యూ సీఎం అంటూ నినదించారు. అనంతరం మహిళలతో కలసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, సర్పంచ్ పులిటి గౌరమ్మ, వైస్ ఎంపీపీ వర్రి విజయ కుమారి, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కె.వెంకటరమణ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు పి.సుజాత, ఏపీఎం శివున్నాయుడుతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## చిన్నారులతో మమేకమైన సబ్ కలెక్టర్



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో ముచ్చటిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్



సీతంపేట: సోమగండి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారితో ఆంగ్ల అక్షరాలు చదివిస్తున్న నూరుల్ కమర్

పాలకొండ రూరల్: సబ్‌డివిజన్ విధుల్లో నిత్యం బిజీగా ఉండే పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్ కొంత సమయం ఉపాధ్యాయునిగా మారిపోయారు. బుధవారం పాలకొండ మండలం లోవిడి లక్ష్మీపురం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడి పిల్లలతో మమేకమయ్యారు. అక్కడి పిల్లలతో సరదాగా గడిపారు. చిన్న చిన్న ప్రశ్నలు వేసి పిల్లల నుంచి సమాధానాలు రాబట్టారు. తన ఉద్యోగ స్థాయిని పక్కన పెట్టి సబ్ కలెక్టర్ పిల్లలతో గడిపిన తీరు అక్కడి సిబ్బంది, గ్రామస్తులను ఆకర్షించింది. ఈ క్రమంలో అధికారి మాట్లాడుతూ కేంద్రాన్ని అంకితభావంతో నడపాలని సూచించారు.

సీతంపేట: మన్యంలో ప్రాథమిక విద్య బలోపేతానికి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ కృషి చేస్తున్నారు. ఏజెన్సీ గ్రామాలను సందర్శించారంటే తప్పనిసరిగా ఏదో ఒక అంగన్‌వాడీ కేంద్రమో, ప్రాథమిక పాఠశాలనో తనిఖీ చేస్తుంటారు. చిన్నారులు ఎలా చదువుతున్నారు?, రాస్తున్నారనేదీ పరిశీలిస్తారు. దీనిలో భాగంగా బుధవారం మండలంలోని సోమగండి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఓ చిన్నారితో ఆంగ్ల అక్షరమాల చదివించారు. ప్రీ స్కూల్ విద్యార్థులందరి చదువులను పరిశీలించారు.

## ముస్తాబవుతున్న రామాలయాలు

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరు, సంతోషపురం, రావుపల్లి, గరుగుబిల్లి, పెద్దూరు, బీవీ.పురం, శివ్వాం, రావివలస తదితర గ్రామాలలో రామ మందిరాలకు చలువ పందిళ్లు వేయడంతో పాటు మందిరాలకు రంగులు వేసి సుందరంగా అలంకరిస్తున్నారు. గురువారం నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకలకు రామమందిరాలను సుందరంగా తీర్చిదిద్దారు. నవమిని పురస్కరించుకొని రామమందిరాలలో ప్రత్యేక పూజలను, శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గరుగుబిల్లిలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

**నేడు శ్రీసీతారాముల కల్యాణం**

తోటపల్లిలోని శ్రీకోదండ రామాలయంలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా ఉదయం సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిది రోజుల నుండి శ్రీసీతారాముల వారికి ప్రత్యేక పూజలను, విశేష అర్చనలను శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహిస్తున్నారు.



తోటపల్లిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

## 'క్రాష్'తోనే నీటి ఎద్దడి నివారణ

గరుగుబిల్లి: వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు గ్రామాల్లో క్రాష్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని ఉమ్మడి జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో క్రాష్ ప్రోగ్రాంను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేలా బోరు బావులకు మరమ్మతులు నిర్వహించేందుకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. నెల రోజుల పాటు మండలంలోని అన్ని పంచాయతీల్లో ముందస్తు సమాచారంతో బోరు బావులను మరమ్మతులు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పైడితల్లి, జేఈ గౌరీశంకరరావు, కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



క్రాష్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ బాపూజీనాయుడు

### ఉల్లాసంగా.. ఉత్సాహంగా...



వీరఘట్టం: బాలికల నృత్యాలు

వీరఘట్టం: మండలంలోని నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగాయి. హెచ్.ఎం జి.రవిప్రసాద్ ఆధ్వర్యంలో బాలబాలికలు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు.

**మంచి ఫలితాలు సాధించాలి**

భామిని: పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని పెద్దదిమిలి జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం ఆనందరావు అన్నారు. పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భామిని: నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

### మొక్కజొన్న పంట పనుల్లో రైతులు



అప్పయ్యపేటలో తడిసిన జొన్నకండెలను అరబెడుతున్న రైతు ఆనందరావు

సీతానగరం: ఆరుతడి పంటల్లో భాగంగా మండలంలోని రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటను ఇళ్లకు చేర్చే పనుల్లో ఉన్న సమయంలో అకాలవర్షాలకు తడిసి పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అప్పయ్యపేట, కొత్తవలస, గెద్దలుప్పి, పెదంకలాం, రేపటివలస, బగ్గందొరవలస, తామరఖండి, లచ్చయ్య పేట, చినభోగిలి, లక్ష్మీపురం గ్రామాల్లో అరకొరగా నీటివసరులున్న భూముల్లో రైతులు ఖరీఫ్‌సీజన్‌లో వరికోత కోసిన భూముల్లో జీరో టిల్లేజ్ విధానం ద్వారా 120 హెక్టార్లలో మొక్కజొన్న సాగుచేశారు. పంట కోతకు రావడం, జొన్నపంట పక్వదశకు వచ్చిన సమయంలో ఈదురుగాలులతో కూడిన అకాలవర్షాల వల్ల పంట పడిపోవడం, కోసిన కండెలు తడిచి మొక్కలురావడం, మడులలో పంట తడిసి పోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. జొన్నకండెలను కూలీలతో కళ్లాలకు చేర్చి అరబెట్టి ప్రభుత్వం రాయితీపై సమకూర్చిన యంత్ర పరికరాల ద్వారా జొన్న గింజలను వేరు చేస్తున్నారు. ఈ ఏడాది జొన్న పంటకు మద్దతు ధర ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రం లేకపోవడంతో దళారులకు విక్రయించాల్సి వస్తోందని అంటున్నారు. మండల కేంద్రంలో, ఆర్‌బీకేల ద్వారా జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**కొనుగోలు కేంద్రం ఏర్పాటు**

ఈ విషయమై ఏఓ ఎస్.అవినాష్ వద్ద ప్రస్తావించగా ఇటీవల వర్షానికి పంట తడిసిపోయిందని, పాలు పోసుకున్న సమయంలో మొక్కజొన్న పంట పరిశీలించి నష్టాన్ని అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. రైతులు పండించిన మొక్కజొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు.

### గ్రంథాలయంలో అదనపు సౌకర్యాలు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



గ్రంథాలయాలకు పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: గ్రంథాలయంలో అదనపు సౌకర్యాలను కల్పించినట్లు ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పురపాలక సంఘం, బెలగాం ప్రాంతంలో గల గ్రంథాలయంలో అదనపు సౌకర్యాలను పెంపొందించి వాటిని ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు గ్రంథాలయం భవనం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రంథాలయంలో అవసరమైన అదనపు కుర్చీలు, బెంచీలతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలు, నవలలు, కథల పుస్తకాలను పురపాలక సంఘం నిధులతో సమకూర్చి పాఠకులకు, యువతకు ఇబ్బంది లేకుండా గ్రంథాలయంలో వసతులు పెంపొందించినట్లు చెప్పారు. ఈ గ్రంథాలయంలో ఇంకా ఏమైనా అవసరం పడితే వాటిని కూడా త్వరిత సమకూరుస్తామని అలానే అదనంగా గాలి పంకాలు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. పార్వతీపురం అర్బన్ రూరల్ ప్రాంతాల నుంచి పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే యువత అంతా ఈ గ్రంథాలయాన్ని చక్కగా వినియోగించుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, అధికారులు, కౌన్సిలర్ సభ్యులు, మున్సిపల్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళాభివృద్ధే లక్ష్యంగా పథకాలు



గుమ్మలక్ష్మీపురం: డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

- కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి వెల్లడి
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండల కేంద్రంలోని బీఎస్ఆర్ కళింగ వైశ్య కల్యాణ మండపం వద్ద బుధవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న 2019 ఎన్నికల్లో గెలిచాక మహిళల జీవితాల్లో వెలుగులు నిండేలా, సుస్థిరమైన ఆదాయం సంపాదించుకునేలా వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా వంటి అనేక సంక్షేమ పథకాలు మహిళల శ్రేయస్సు కోసమే అమలు పరుస్తున్నారన్నారు. దేశానికే ఆదర్శంగా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ తీసుకొచ్చి సొంత ఊర్లోనే/ఇంట్లోనే నేరుగా సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారని అన్నారు. మహిళా సంక్షేమం కోరి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగించుకొని, మహిళలంతా ఆర్థికాభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత కింద మండలంలోని 27 పంచాయతీల పరిధిలో గల 565 స్వయం సహాయక సంఘాల్లోని 6472 మంది మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2,15,23,895ల చెక్కుతో పాటు, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా మండలంలోని 72 స్వయం సహాయక సంఘాల్లోని 765 మంది సభ్యులకు మంజూరైన రూ.2,10,60,000ల చెక్కును కూడా ఎమ్మెల్యే విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఆదయ్య, సీసీలతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ఫీల్డ్ బుక్‌లు సిద్ధం చేయండి

భామిని: గ్రామాల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలకు సంబంధించి ఫీల్డ్ బుక్‌లో విధిగా నమోదు చేయాలని హౌసింగ్ ఏఈఈ ఎల్.ప్రభాకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ఇంజినీరింగ్ సహాయకులతో బుధవారం ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ పక్కా గృహాల కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు క్షేత్ర పరిశీలన ముఖ్యమన్నారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తి కావస్తున్న పీఎంఏవై గృహాలను దశల వారీగా గుర్తించాలన్నారు. ఉన్నతాధికారులు ఆదేశాలు వచ్చిన వెంటనే బిల్లుల చెల్లింపునకు రంగం సిద్ధంగా ఉండాలన్నారు. హౌసింగ్ సిబ్బంది బి.రాంబాబు, టి.సునీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈఈ ప్రభాకరరావు

## మెనూ ప్రకారం 'భోజనం'

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్ద పథకం మెనూ ప్రకారం పెట్టాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా భోజన వంటలను రుచి చూశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అమలు చేయకపోతే నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మెనూను అమలు చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ పరిశీలనలో కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులున్నారు.

**పౌష్టికాహారం తీసుకోవాలి**

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు విధిగా పౌష్టికాహారాన్ని అందించాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రతీరోజు గుడ్డు, పాలు, ఆకు కూరలు, కాయగూరలతో భోజనం అందించాలన్నారు.



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

## ఉపాధి లక్ష్యాలను పూర్తి చేయండి

పాలకొండ రూరల్: గ్రామ స్థాయిలో చేపడుతున్న ఉపాధి పనుల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ దొంక త్రినాధులు అన్నారు. పాలకొండ మండలం తంపటాపల్లి, తుమరాడ తదితర గ్రామాల్లో జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. ముఖ్యంగా అమృత్ సరోవర్ పేరిట చేపడుతున్న చెరువు పనుల విషయంలో ఉపాధి క్షేత్ర సిబ్బంది అంకితభావంతో వ్యవహరించాలన్నారు. వేతనదారుల హాజరు, వారికి కల్పించాల్సిన కనీస వసతులు, వేసవి నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరా తీశారు. అవసరమైన సూచనలు చేసారు.



తంపటాపల్లి చెల్లెమ్మ కోనేటి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

## చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు

కురుపాం: మండల కేంద్రంలోని రోడ్డు విస్తరణ, ఆక్రమణల తొలగింపు పనులు రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చురుగ్గా పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే స్థానిక ధూళికేశ్వరస్వామి ఆలయం నుండి రోడ్డుకు ఇరువైపుల విస్తరణ, ఆక్రమణల తొలగింపులను యంత్రాల సహాయంతో చేపడుతున్నారు. స్థానిక వ్యాపారులు స్వచ్ఛందంగా అధికారులు ఇచ్చిన మార్కు ప్రకారం నిర్మాణాలను తొలగించుకుంటున్నారు. ఇదిలా ఉండగా రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపు ఒకేలా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రాజకీయ పలుకుబడితో రోడ్డుకు ఇరువైపులా కొలతల్లో తేడాలు చూపితే మండల కేంద్రంలోనే నిరసన చేపడతామని స్థానికులు అధికారులను హెచ్చరిస్తున్నారు.



కురుపాంలో రోడ్డు విస్తరణ పనులు

## సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ

కురుపాం: ఏజెన్సీలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గిరిజన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందాల్సిన పౌష్టిహారం పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని రస్తాకుంటుబాయి గిరిజన గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాల నమోదును పరిశీలించారు. అలాగే పౌష్టికాహార నిల్వలను పరిశీలించగా స్టాక్ రిజిస్టర్‌లో నమోదుకు నిల్వలకు తేడా ఉండటాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఈ పరిశీలనలో ఆర్‌ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో మెనూను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్